క్లుప్తంగా

బకాయిల వసూళ్లపై దృష్టి


సమీక్ష నిర్వహిస్తున్న డీజీఎం సురేంద్ర

గూడూరు: పొదుపు మహిళలకు ఇచ్చిన శ్రీనిధి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని డీజీఎం సురేంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో.. మండలంలోని పెంచికలపాడు, కే.నాగులాపురం, మల్లాపురం, గుడిపాడు గ్రామాలలోని శ్రీనిధి బకాయిలపై డీజీఎం, ఏజీఎం దయాసాగర్, శ్రీనిధి ఏరియా మేనేజర్ శశిధర్ రెడ్డి కలిసి స్థానిక వైకేపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రుణాల వివరాలు, వసూళ్లు, తదతర వాటిపై రికార్డులు పరిశీలించారు. ఏపీఎం సుధాకర్, సీసీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల బృందం

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఎంబీఏ కళాశాలలో శుక్రవారం హెటిరో ల్యాబ్స్, హైదరాబాద్ వారిచే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ కె.విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. కళాశాలలో గత నాలుగేళ్లలో ఎంబీఏ, ఫార్మసీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సుమారుగా 90 మంది హాజరుకాగా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. హెటిరో ల్యాబ్స్ హెచ్‌ఆర్ మేనేజర్ జి.సీమోను, ప్రిన్సిపాల్ రవిశంకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


పసుపలలో ఆరోగ్యవంతమైన జీవనశైలిపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు (న్యూటౌన్): ప్లాస్టిక్ సంచుల వాడకం వద్దని, కాటన్ సంచులను వినియోగిద్దామని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం పసుపల గ్రామ సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్మీకంపోస్టు ఉత్పత్తిని పెంచి రైతులకు సబ్సిడీపై అందజేయాలని సూచించారు. సచివాలయాలలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు తప్పకుండా 'స్పందన' కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని (మిషన్ లైఫ్) పర్యావరణహిత జీవనశైలి (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ లైఫ్) కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వినియోగించరాదని, నీటిని ఆదా చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆరోగ్యవంతమైన జీవనశైలిపై సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

వేలంలో పెరిగిన ఆదాయం

గడివేముల: మండల పరిధిలోని కొరప్రోలురు గ్రామంలో చెన్నకేశవ, ఆంజనేయ స్వామి వార్ల మాన్యం భూములకు నిర్వహించిన వేలంపాటలో గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగినట్లు ఈఓ మోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక దేవస్థానంలో 64 ఎకరాలకు సంబంధించి కౌలు హక్కుల కోసం వేలంపాటలు నిర్వహించగా రూ. 7,52,000 పలికింది. గతేడాది కంటే రూ.1,97, 500 అధికంగా ఆదాయం లభించింది. సర్పంచ్ మాలిక్ బాషా, రామసుబ్బారెడ్డి, పర్యవేక్షణ అధికారి జనార్దన్ రైతులు, అర్చకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

గడివేముల: దుర్వేసి గ్రామానికి చెందిన వల్లెపు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 22వ తేదీన శ్రీనివా సులు తన ఇంటి వద్ద వేసిన షామియానాలను తీస్తుండగా ఆటోలో వెళ్తున్న వెంకట సుబ్బయ్య, వెంకటరమణ, వల్లపు వెంకట రమణ ఆటో తగిలే విధంగా దగ్గరకు వెళ్లారు. దీనిపై మాటకు మాట పెరిగి వల్లపు శ్రీనివాసులుతో పాటు తల్లి వెంకటేశ్వరమ్మ దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యం

ఓర్వకల్లు: గ్రామాలలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఏపీఓ కుమార్ సాయినాథ్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంచుకోవడానికి ముందుకు వచ్చిన రైతులకు మూడేళ్ల వరకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందన్నారు. 1-3 ఎకరాలు గల చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మామిడి తోటలకు మూడేళ్లకు రూ.99,840, సపోటకు రూ.88,655, కొబ్బరికి రూ.90,476, సీతాఫలంకు రూ.1,82,840, చీని సాగుకు రూ. 1,07,459, జామ రూ.1,27,451 ఇలా మొత్తం 14 రకాల తోటలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఉపాధి సిబ్బంది వద్ద పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పచ్చిరొట్ట.. సిరుల పంట

- పచ్చిరొట్ట ఎరువుతో నేల సారవంతం
- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- ప్రస్తుతం పచ్చిరొట్ట సాగుకు సరైన సమయం
- 50 శాతం రాయితీతో ఆర్బీకేల్లో అందుబాటులో విత్తనాలు
- జిల్లాకు 4,905 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల మంజూరు


సాగు చేసిన జీలుగ పంట


పెసరవాయిలో జీలుగ విత్తనాలను అందజేస్తున్న ఏఓ (ఫైల్)

గడివేముల: అధిక మోతాదులో వేసే రసాయనిక ఎరువులతో భూములు నిస్సారమవుతాయి. అలాంటప్పుడు పచ్చిరొట్ట పైర్ల సాగుతో పెట్టుబడి ఖర్చు తగ్గడమే గాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లి మొక్కలు పూత వచ్చే దశలో భూమిలో కలియదున్ని తగినంత నీరు పెట్టి కుల్లనివ్వాలి. ఇలా చేయడం వల్ల నేల సారవంతం కావడంతో పాటు సేంద్రియ కర్బణం పెరిగి అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తుంది. ఎకరానికి 5-6 టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదు టన్నుల ఎరువులో 16-24 కిలోల నత్రజని, 7.5 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ ఉంటుంది. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడటానికి దోహదం చేస్తుంది. ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో వీటి సాగుతో పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 4,905 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరయ్యాయని, అందులో 4,675 క్వింటాళ్ల జీలుగలు, 225 క్వింటాళ్ల పిల్లిపెసర, 3 క్వింటాళ్ల జనుము విత్తనాలు ఉన్నట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు. ఆయా విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డి-క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని సబ్సిడీపోనూ మిగతా డబ్బు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందిస్తామని చెప్పారు. గడివేముల మండలానికి 119 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. వీటి ధర కిలో రూ.79 ఉండగా 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. గడివేముల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 22 వేల ఎకరాల వరకు పంటల సాగు ఉంటుందని, వరి పంట 12 ఎకరాల దాకా సాగవుందని అధికారులు వెల్లడించారు.

పచ్చిరొట్ట లాభాలు

పచ్చిరొట్ట పైర్లను భూముల్లో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్లవారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మపోషకాల లభ్యత పెరుగుతుంది. తేమను ఎక్కువ రోజులు నిలుపుకొనే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పచ్చిరొట్ట పైర్లకు వేరు బుడిపెలు ఉండటం వల్ల నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నిలువరిస్తాయి. ఒకవేళ భూముల్లో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు తగ్గించి సారవంతంగా చేస్తాయి.

పచ్చి ఆకు ఎరువు

పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట చెట్ల ఆకులు, లేత కొమ్మలు బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. ఇందుకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ, తదితర వాటిని వినియోగించవచ్చు.

ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు

పచ్చిరొట్ట పైర్లు త్వరత్వరగా పెరిగి ఆకులు ఎక్కువ వచ్చి కాండం మెత్తగా ఉండాలి. కాండం మృదువుగా ఉండి త్వరగా కుళ్లే స్వభావం కలిగి ఉండాలి. అన్ని నేలలకు నీటి ఎద్దడికి తట్టుకొనేలా ఉండాలి. తక్కువ సారమున్న నేలల్లో కూడా ఏపుగా పెరిగి పచ్చిరొట్ట నిచ్చేదిగా ఉండాలి. పచ్చిరొట్ట పైర్ల వేర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకొని పోయే గుణం కలిగి ఉండాలి.

రైతులు సద్వినియోగం చేసుకోండి

పచ్చిరొట్ట పైర్లతో ఎంతో మేలు కలుగుతుంది. పచ్చి రొట్ట పైర్లను భూమిలో కలిగియదున్నడంతో పంటకు మేలుచేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది. రసాయన ఎరువుల వినియోగం సైతం తగ్గుతుంది. ప్రస్తుతం 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

నేడు పల్‌దొడ్డిలో గడప గడపకు మన ప్రభుత్వం

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్‌దొడ్డి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో ఉదయం 7:30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సేవలు, సంక్షేమ పథకాలను వివరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు అందరూ తప్పకుండ అందుబాటులో ఉండాలని కోరారు.

గాయపడిన మహిళ మృతి

సి.బెళగల్: మండలంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన తుమ్మిళ్ల జ్యోతి, భర్త వెంకటేష్‌తో కలిసి స్కూటర్‌పై వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బాధితురాలిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా కోలుకోలేక శుక్రవారం తెల్లవాజుమున ఆసుపత్రిలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా రీసర్వే

ఓర్వకల్లు: మండలంలో రీ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు కేతవరం, కన్నమడకల, హుసేనాపురం, లొద్దిపల్లె, తిప్పాయపల్లె, ఉయ్యాలవాడ గ్రామాలలో సర్వే పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల రైతులు సర్వే బృందాలకు సహకరించాలని కోరారు. రైతులు సహకరిస్తే 120 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

'స్పందన' తప్పనిసరి


కొత్తకోట సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. ఆయన శుక్రవారం కొత్తకోట గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరు, గ్రామంలోని లబ్ధిదారుల వివరాల రికార్డులను పరిశీలించారు. స్పందన సమస్యల నమోదు, పరిష్కార అంశాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సచివాలయాలలో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని, స్పందనలో నమోదైన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం కాని సమస్యలను ప్రజలకు వివరించి ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు. స్పందన కార్యక్రమానికి అందుబాటులో ఉండని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవలకు సముచిత గౌరవం


సేవా రత్న పురస్కారానికి ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్లకు కల్పించారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకే చేరుస్తున్నారన్నారు. తమకు కేటాయించిన 50 కుటుంబాలకు ఏ చిన్న కష్టమొచ్చినా ముందుగా వలంటీర్లు గుర్తుకొస్తున్నారని, అంతలా వ్యవస్థను పటిష్టం చేశారని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించాలని గుర్తు చేశారు. వలంటీర్లు ప్రజలకు నిత్యం అదుబాటులో ఉండి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. 2014లో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక మాటమార్చిన చంద్రబాబు పాలన, 2019లో అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం మండలంలోని 222 మంది వలంటీర్లను ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని మంచాలకట్ట, గని, ఒండుట్ల గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు శుక్రవారం గని జెడ్పీ పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయా గ్రామాలకు చెందిన 45 మంది వలంటీర్లను సేవా పురస్కారాలతో పాటు శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగేళ్లుగా నియోజవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, సర్పంచ్ కత్తి తులషమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓఆర్‌డీ ఖలీక్, తదితరులు పాల్గొన్నారు.

పాణ్యంకు ముఖద్వారం అలంకారం

పాణ్యం: పాణ్యంకు ఆ పేరు రావడానికి కారణమైన శ్రీ పాణికేశ్వర స్వామి ఆలయ ముఖద్వారాన్ని ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిర్మించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం పాణ్యంలో ఆర్చ్ నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీటీడీ ద్వారా నిధులు కేటాయించి పాణికేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. పాలనాపరమైన అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే సర్వీస్ రోడ్డు నుంచి పాణ్యంలోకి వెళ్లే దారిలో ముఖద్వారం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించారు. పోలీసు స్టేషన్ సమీపంలో ఆర్చ్ నిర్మిస్తే బాగుంటుదని గ్రామస్తులు చెప్పడంతో స్థలాన్ని పరిశీలించారు. అధునాతన డిజైన్లతో సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ముఖద్వారంపై ఏర్పాటు చేయనున్న దేవతా మూర్తుల ప్రతిమల గురించి ఆరా తీశారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

భవన నిర్మాణాల పరిశీలన

గూడూరు రూరల్: పెంచికలపాడులో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవన నిర్మాణాలను శుక్రవారం ఎంపీడీఓ మాధవీలత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రెండు భవన నిర్మాణాలు చురుగ్గా సాగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నిరుపయోగ వస్తువులు అందించండి


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్

గూడూరు: జూన్ 5వ తేదీన నిర్వహించే పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు మేరా లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నగర పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి జూన్ 4వ తేదీ వరకు పట్టణంలో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్ -రీయూజ్-రీసైకిల్) సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలో నిరుపయోగంగా వస్తువులు, ఇనుప కుర్చీలు, దుస్తులు, చెప్పులు, దిండ్లు, బూట్లు, పరుపులు, బీరువాలు, చెక్క టేబుల్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, తదితర వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో అప్పగించాలని కోరారు. వాటిని సేకరించి అవసరమైన వారికి అందిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, ఏఈ వైష్ణవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కోడుమూరులో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కోడుమూరు రూరల్: రైతన్న సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ రవిప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుధాకర్ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పండించిన పంటకు గిట్టుబాటు ధర, సబ్సిడీపై విత్తనాల పంపిణీ వంటి ఎన్నో పథకాలను అందజేస్తున్నారన్నారు. ముఖ్యంగా రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ బాలకృష్ణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మాన్యుయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, మధమోహన్ రెడ్డి, పాపిరెడ్డి, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు సారథులు వలంటీర్లేనని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శుక్రవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 322 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవా రత్న, ఇద్దరికి సేవా వజ్ర పురస్కారాలను అందజేసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలను అందజేస్తూ నిత్యం వారితో మమేకమై చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ రమాదేవి, ఏఓ అజయ్‌భాస్కర్, సర్పంచ్ బాలకృష్ణ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, డైరెక్టర్ ఇమ్మానేయులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

కర్నూలు (న్యూటౌన్): సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం కోడుమూరులోని ఎమ్మెల్యే నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కర్నూలు మండలం పంచలింగాలకు చెందిన ధనుంజయ కీళ్ల వ్యాధితో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో మంజూరైన రూ.లక్ష, ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీనాయుడుకు మంజూరైన రూ.2 లక్షలు, గూడూరుకు చెందిన లక్ష్మన్న అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా మంజూరైన రూ.1.20 లక్షల చెక్కులను వారికి పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

నేడు సి.బెళగల్‌లో వలంటీర్లకు సత్కారం

సి.బెళగల్: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లను సి.బెళగల్‌లో శనివారం ఘనంగా సత్కరించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన పేర్కొంటూ.. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 232 మంది వలంటీర్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. సి.బెళగల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి సన్మాన కార్యక్రమం ఉంటుందని, అన్ని గ్రామాల వలంటీర్లు, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతున్నట్లు వెల్లడించారు.

మధ్యాహ్నం నందనపల్లెలో..

కర్నూలు (న్యూటౌన్): ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు కర్నూలు మండలం నందనపల్లె గ్రామ సమీపంలోని శ్రీనివాస గార్డెన్‌లో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పాల్గొని మండల పరిధిలోని 311 మంది వలంటీర్లను సేవామిత్ర, ఐదుగురు వలంటీర్లకు సేవా రత్న అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు.

30 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా 30వ తేదీన ఉదయం గణ పతి పూజ, పుణ్యాహావచనం, ఋత్విక్‌కరణం, మండపారాధన, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం బలిహరణం, జలాధివాసం, మహా మంగళహారతి పూజలు జరుపుతారని చెప్పారు. 31వ తేదీన ఉదయం దింబశుద్ధి, నవగ్రహ ధ్వజజపాలు, సాయంత్రం బలిహోమం, తీర్థప్రసాద వితరణ, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, మహా మంగళహారతి పూజలు ఉంటాయన్నారు. అలాగే జూన్ 1వ తేదీన ఉదయం 6 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

కార్యాలయాల నిర్మాణం పూర్తి చేయండి


మాట్లాడుతున్న పీఆర్ ఈఈ మద్దన్న

కోడుమూరు రూరల్: గ్రామాల్లో చేపడుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఈఈ మద్దన్న సూచించారు. మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులతో జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, పీఆర్ ఈఈ మద్దన్న, డీఈఈ మహేశ్వరరెడ్డి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయి, బిల్లులు మంజూరయ్యాయా? పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు తదితర వాటిపై సిబ్బంది, కాంట్రాక్టర్లతో గ్రామాల వారీగా సమీక్షించారు. సెప్టెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించి 65 నుంచి 70 శాతం మేర బిల్లులు మంజూరయ్యాయని, మిగతా బిల్లులు మరో 10 రోజుల్లో మంజూరు చేస్తామని కాంట్రాక్టర్లకు సూచించారు. కృష్ణాపురం, ఎర్రదొడ్డి గ్రామ సర్పంచులు శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పీఆర్ ఏఈ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం


డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వామసముద్రంలో జరుగుతున్న డ్రైడే - ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, లార్వాలు పెరగకుండా నివారించవచ్చన్నారు. వారానికి ఒకసారి డ్రమ్ములు, గచ్చులు, తొట్టెలలో ఉన్న నీరు పారబోసి శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తిస్తే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత సచివాలయ కార్యదర్శి ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆనందరావు, ఎమ్ఎల్‌పీ, సీహెచ్ఓ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు


నూతనపల్లెలో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే చేస్తున్న వీఆర్‌ఓలు, సర్వే సహాయకులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామని రూరల్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. శుక్రవారం నూతనపల్లెలో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేను ఆయన సమీక్షించారు. సర్వే పూర్తయ్యాక డిజిటల్ రెవెన్యూ రికార్డులను తయారు చేస్తామన్నారు. ఫీల్డ్ సర్వేతో పాటు గ్రౌండ్ ట్రూతింగ్‌లోని హెచ్చుతగ్గులను పరిశీలించి ఎవరి భూమి ఎంతనే వివరాలను నమోదు చేయించి, హద్దులు చూపి రైతుల మధ్య నెలకొన్న వివాదాలకు పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సర్వే సహాయకులు, రైతులు పాల్గొన్నారు.